AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in

## ఇంటర్‌తో ఆర్ఆర్‌బీలో ఉద్యోగావకాశాలు




**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్న వారికి రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు శుభవార్త తెలిపింది. 12వ తరగతి విద్యార్హతతో నాన్ టెక్నికల్ పాపులర్ కేటగిరీలో 3,050 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అక్టోబర్ 28వ తేదీ నుంచి నవంబర్ 27 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అన్ని పోస్టులకు సీబీటీ 1, సీబీటీ 2 నిర్వహిస్తారు. జూనియర్ క్లర్క్ కం టైపిస్ట్, అకౌంట్ క్లర్క్ కం టైపిస్ట్ పోస్టులకు అదనంగా స్కిల్ టెస్ట్ ఉంటుంది.

## ఢిల్లీలో మరోసారి కాల్పుల కలకలం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశ రాజధాని ఢిల్లీలో మరోసారి కాల్పులు చోటు చేసుకున్నాయి. ఇటీవల బీహార్‌కు చెందిన సిగ్మా గ్యాంగ్‌లోని నలుగురు సభ్యులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా హై మెహ్రౌలి ప్రాంతంలో కాల్పులు జరిగాయి. మోస్ట్ వాంటెడ్ నేరస్తుడు పహారియాను పట్టుకునేందుకు ఢిల్లీ పోలీసులు యత్నించారు. అతడు వారిపై కాల్పులు జరిపాడు. దీంతో పోలీసులు ఎదురు కాల్పులు జరపడంతో నిందితుడు గాయపడ్డాడు. ఈ ఘటనలో ఓ కానిస్టేబుల్‌కు సైతం గాయాలయ్యాయి.


25-10-2025 (Saturday) MAIN EDITION

## మావోయిస్టుల ఘాతుకం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లాలో ఇన్‌ఫార్మర్ల నెపంతో ఇద్దరు వ్యక్తులను హత్య చేశారు. బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కాంకేర్ గ్రామానికి చెందిన తిరుపతి సోధి, రవి కట్టంలను పదునైన ఆయుధాలతో దాడి చేసి చంపారు.

## ఈ దశాబ్దం మోదీదే: చంద్రబాబు



**అక్షరటుడే, అమరావతి:** ఈ దశాబ్దం మోదీదే అని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అభివర్ణించారు. ఎన్డీయే ప్రగతిశీల ప్రభుత్వమని కొనియాడారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. తాను కూడా ప్రచారం చేస్తానన్నారు.

## ఆసీస్‌పై టీమిండియా విజయం



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** మూడో వన్డేలో ఆస్ట్రేలియాపై భారత్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఆసిస్ జట్టు 236 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన భారత బ్యాటర్లు రాణించారు. రోహిత్ శర్మ (121), కోహ్లీ (74) అద్భుత ప్రదర్శనతో టీమిండియాను గెలుపు తీరానికి చేర్చారు.

## ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** ఇంటర్ పరీక్షల షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు అధికారులు శనివారం విడుదల చేశారు. ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18వ తేదీ వరకు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. ఇంటర్ బోర్డు సెక్రెటరీ కృష్ణ ఆదిత్య శనివారం పరీక్షల వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు, 26 నుంచి సెకండియర్ పరీక్షలు ప్రారంభం అవుతాయి. మార్చి 18 వరకు ఎగ్జామ్స్ కొనసాగుతాయి. ఈ ఏడాది మొత్తం 9.50 లక్షల మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయనున్నారు. నవంబర్ 1 నుంచి ఇంటర్ విద్యార్థుల నుంచి పరీక్ష ఫీజు వసూలు చేయనున్నారు.

## ఓఆర్ఆర్‌పై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా

**అక్షరటుడే, హైదరాబాద్:** హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. న్యూగో ట్రావెల్స్‌కు చెందిన ఎలక్ట్రిక్ బస్సు మియాపూర్ నుంచి గుంటూరు వెళ్తుండగా.. పెద్ద అంబర్‌పేట్ దగ్గర బోల్తాపడింది. ఆ సమయంలో బస్సులో 20 మంది ప్రయాణికులు ఉన్నారు. పటాన్ చెరువు దగ్గర ఔటర్ ఎక్కి పెద్దఅంబర్ పేట్ దగ్గర దిగుతున్న సమయంలో ప్రమాదం చోటు చేసుంది. ఈ ఘటనలో పలువురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

**ప్రైవేట్ బస్సులపై ఆర్టీఏ అధికారుల కొరడా ఝుళిపించారు. కర్నూల్ సమీపంలో వేమూరి ట్రావెల్స్ బస్సు దగ్ధమై 20 మంది సజీవ దహనం అయిన విషయం తెలిసిందే. ఈ ఘటనతో అధికారులు అప్రమత్తం అయ్యారు. ప్రత్యేక బృందాలతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ బస్సులను తనిఖీ చేశారు. శనివారం ఉదయం నుంచి హైదరాబాద్ నగరంలో ప్రైవేట్ బస్సులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వాహనాలపై జరిమానాలు వేశారు. పలు ట్రావెల్స్‌పై చర్యలకు సిద్ధం అవుతున్నారు.**

-అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# ప్రైవేట్ ట్రావెల్స్‌పై కొరడా..




- కర్నూలు ఘటనతో అప్రమత్తమైన ఆర్టీఏ అధికారులు
- రాష్ట్రంలోని పలుచోట్ల తనిఖీలు
- నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు
- పలు బస్సుల సీజ్

కర్నూలు ఘటనతో ప్రైవేట్ ట్రావెల్స్ వాహనాల్లో ప్రయాణంపై ప్రజల్లో ఆందోళన నెలకొంది. చాలా వరకు ట్రావెల్స్ నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ తదితర జిల్లాల్లో తనిఖీలు చేపట్టారు. ట్రావెల్స్ బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు, బీమా వంటివి పరిశీలించారు. పత్రాలు లేకుండా నడుస్తున్న బస్సులను సీజ్ చేసి, చలాన్లు వసూలు చేశారు. నిబంధనలు, భద్రతా ప్రమాణాలు పాటించని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### వాహనాలు సీజ్

కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద ఇటీవల జరిగిన ఘోర బస్సు ప్రమాదంలో 20 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. అధికారుల పరిశీలనలో బస్సులో పలు సాంకేతిక లోపాలు ఉన్నట్లు గుర్తించారు. ప్రమాదం తర్వాత హైదరాబాద్‌లో రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీస్‌లు తనిఖీలు చేపట్టారు. డ్రంకన్ డ్రైవ్, బీమా, ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు, పర్మిట్ పత్రాలు, బస్సుల భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. రంగారెడ్డి జిల్లా బండ్లగూడ వనస్థలి పురంలో అధికారులు తనిఖీలు చేశారు. బండ్లగూడలో 60కి పైగా వాహనాలను పరిశీలించారు. నిబంధనలో పాటించని 12 బస్సుల పై కేసులు నమోదు చేశారు. 8 బస్సులను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

### ఆటోలు, క్యాబ్‌లను సైతం..

హైదరాబాద్ నగరంలోని కూకట్‌పల్లి, హయత్‌నగర్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో కూడా ట్రావెల్స్ బస్సులు, ఆటోలు, క్యాబ్‌లను తనిఖీ చేసి, లైసెన్స్ లేకుండా నడుపుతున్న డ్రైవర్లపై చర్యలు తీసుకున్నారు. వాహనాలపై ఉన్న చలాన్లను వసూలు చేసి, చెల్లించిన తర్వాతే వాహనాలను పంపించారు. భద్రతా ప్రమాణాలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు.

### అప్పుడే హడావుడి

ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు ఆర్టీఏ అధికారులు హడావుడి చేస్తారు. ఆ తర్వాత షరామామూలే అన్నట్లు వ్యవహరిస్తారు. అసలు అధికారులు నిత్యం సక్రమంగా విధులు నిర్వహిస్తే ప్రమాదాలు ఎందుకు జరుగుతాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. పెద్ద పెద్ద సంఘటనలు జరిగినప్పుడు రెండు మూడు రోజులు తనిఖీలు చేపట్టి చేతులు దులుపుకుంటారనే విమర్శలు ఉన్నాయి.

## అమరవీరుల కుటుంబాలకు కోటి రూపాయలివ్వాలి: కవిత



**అక్షరటుడే, హైదరాబాద్ :** అమరవీరుల కుటుంబాలకు రూ. కోటి ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి జనం బాటలో భాగంగా అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమంలో 1200 మంది అమరులయ్యారన్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో అమరుల ఆశయాలు నెరవేర్చడంలో ఎంత వరకు ముందుకు వెళ్లామో ఆలోచించుకోవాలని కవిత అన్నారు.

### అమరుల కుటుంబాలకు కవిత క్షమాపణలు

తెలంగాణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు కవిత క్షమాపణలు చెప్పారు. ఉద్యమకారుల కోసం కొట్లాడలేక పోయినందుకు క్షమాపణలు చెబుతున్నా అని కవిత భావోద్వేగానికి గురయ్యారు. రాష్ట్రం కోసం 1200 మంది అమరులు అయ్యారని ఆమె చెప్పారు. అమరవీరుల కుటుంబాలకు అనుకున్న మేర న్యాయం చేయలేకపోయమన్నారు. 580 మంది కుటుంబాలకు మాత్రమే ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. మిగతా వారికి న్యాయం చేయాలని గతంలో తాను పలుమార్లు అడిగినట్లు చెప్పారు. అయితే ఇంకా గట్టిగా కొట్లాడాల్సి ఉండే అని అభిప్రాయ పడ్డారు. మంత్రిగా లేకున్నా.. తాను అమరుల కోసం మాట్లాడానని, కానీ న్యాయం జరిగే వరకు వారి పక్షాన నిలబడనందుకు క్షమాపణలు చెబుతున్నట్లు తెలిపారు.

## జోర్డాన్‌లో చిక్కుకున్న వారిని స్వదేశానికి రప్పించిన హరీశ్‌రావు

**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** బతుకు దెరువు కోసం జోర్డాన్ వెళ్లి చిక్కుకున్న 12 మందిని మాజీ మంత్రి హరీశ్‌రావు స్వస్థలానికి చేర్చారు. జోర్డాన్‌లో వారు పనిచేసే కంపెనీకి పెనాల్టీతో పాటు, రవాణా ఖర్చును భరించి బాధితులను ఆయన హైదరాబాద్‌కు రప్పించారు. తెలంగాణకు చెందిన 12 మంది బతుకు దెరువు కోసం గతంలో జోర్డాన్ వెళ్లారు. అయితే ఏజెంట్ మోసాలకు బలై అక్కడ చిక్కుకుపోయారు. దీంతో తమను కాపాడాలని వేడుకున్నారు. ఈ మేరకు స్పందించిన మాజీ మంత్రి హరీశ్‌రావు చర్యలు చేపట్టారు. అక్కడి కంపెనీతో మాట్లాడి వారి తరఫున ఆయన పెనాల్టి చెల్లించారు. శనివారం ఉదయం బాధితులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చేరుకున్నారు. అనంతరం నేరుగా హరీశ్ రావు ఇంటికి వెళ్లి కలిశారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.



## దూసుకొస్తున్న 'మొంథా' తుపాను..

**అక్షరటుడే, అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌కు తుపాను ముప్పు పొంచి ఉంది. దూసుకొస్తున్న 'మొంథా' తుపాను.. రాష్ట్రంలో తీరం దాటే అవకాశం ఉంది. దీంతో ఏపీకి వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ జారీ చేసింది. అక్టోబర్ 26, 27, 28, 29 తేదీల్లో తుపాను చాలా ప్రభావం చూపిస్తుందని వాతావరణ కేంద్రం తెలిపారు. ఈ నెల 28న సాయంత్రం కాకినాడ సమీపంలో తీవ్రమైన తుపానుగా తీరం దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. ఆ సమయంలో గంటకు 90 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయన్నారు. విశాఖపట్నం తిరుపతి వరకూ దీని ప్రభావం ఉండనుంది. హైదరాబాద్ సహా తెలంగాణలోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఆంధ్రప్రదేశ్‌లోని తీర ప్రాంత జిల్లాల్లో ఉన్న విద్యా సంస్థలకు 28, 29 తేదీల్లో సెలవు ప్రకటించాలని వాతావరణ అధికారులు సూచించారు. దూర ప్రాంతాలకు వెళ్లే వారు ప్రయాణాలు మానుకోవాలన్నారు. భారీ వర్షాలు కులిసే అవకాశం ఉండడంతో మచిలీపట్నం, గుంటూరు, ఏలూరు, విజయవాడ, దివిసీమ, గోదావరి జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## క్రెడిట్ కార్డు యూజర్లకు ఎస్‌బీఐ షాక్



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** క్రెడిట్ కార్డు యూజర్లకు ఎస్‌బీఐ షాక్ ఇచ్చింది. సర్వీస్ ఛార్జీలు, ఇతర ఫీజులను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. కొత్త ఛార్జీలు నవంబర్ 1 నుంచి అమలులోకి రానున్నాయి. చాలా మంది యూజర్లు క్రెడిట్ కార్డు ద్వారా డబ్బులు తీసుకుంటున్నారు. థర్డ్ పార్టీ యాప్స్ ద్వారా చేసే ఎడ్యుకేషన్ పేమెంట్లపై ఒక శాతం ఫీజు వసూలు చేస్తామని ప్రకటించింది. అయితే నేరుగా పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా లేదా పీవోఎస్ యంత్రాల ద్వారా చెల్లింపులు చేస్తే మాత్రం ఎలాంటి ఫీజు ఉండదు. దీంతో నెల వారి ఖర్చుల కోసం ఎడ్యుకేషన్ ఫీజు పేరిట డబ్బులు డ్రా చేసుకునే వారికి ఛార్జీలు పడనున్నాయి.

## ఏసీబీకి చిక్కిన డీసీవో



**అక్షరటుడే, మంచిర్యాల:** మరో అవినీతి అధికారి ఏసీబీకి చిక్కాడు. రూ.రెండు లక్షల లంచం తీసుకుంటూ డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయాడు. మంచిర్యాల జిల్లా కో-ఆపరేటివ్ ఆఫీసర్ రాథోడ్ బిక్కును ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. సస్పెండ్ అయిన ఓ ఉద్యోగికి పెరిగిన జీతాలు మంజూరు చేసేందుకు రాథోడ్ రూ.8 లక్షలు డిమాండ్ చేశాడు. అందులో మొదటి విడతగా రూ.రెండు లక్షలు ఇవ్వాలన్నాడు. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. జిల్లా కేంద్రంలోని ఇక్బల్ అహ్మద్ నగర్‌లోని తన నివాసంలో శనివారం డీసీవో రూ.రెండు లక్షల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆయనను అదుపులోకి తీసుకొని ఇంట్లో, కార్యాలయంలో సోదాలు చేపట్టారు. మంచిర్యాల కలెక్టరేట్ లో ఆయనను విచారిస్తున్నారు. ఆసిఫాబాద్‌లోని ఇచ్చోడలోని రాథోడ్ బిక్కు ఇంట్లో సైతం తనిఖీలు నిర్వహించారు.

## ఆ సమయంలో మౌనంగా ఉండడమే మేలు: జాన్వీ



**పురుషాధిక్య ప్రపంచంలో నెగ్గుకురావాలంటే కొన్నిసార్లు మౌనంగా ఉండాల్సి వస్తుందన్నారు నటి జాన్వీకపూర్. తాను ఎన్నోసార్లు అలా ఉన్నానని చెప్పారు. పరిశ్రమలో కొన్నిసార్లు ఎదుర్కొంటోన్న సమస్యలపై ఆమె 'టూ మచ్ విత్ కాజోల్ అండ్ ట్వింకిల్' టాక్ షోలో మాట్లాడారు. "సినీ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి ఇండస్ట్రీకి వచ్చాను. అయినప్పటికీ కొన్ని విషయాలు ఇక్కడికి వచ్చాకే నేర్చుకున్నాను. ఇక్కడ కొనసాగాలంటే పురుష అహంకారాన్ని ఎదుర్కోవాలి. నలుగురు మహిళలు ఉన్న ప్రదేశంలో నేను ధైర్యంగా నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయగలను.. కానీ, అదే ప్రదేశంలో నలుగురు పురుషులు ఉంటే మాత్రం నేను నా అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేను. ఎందుకంటే వారు నొచ్చుకోకుండా వెల్లడించాల్సి ఉంటుంది" అని జాన్వీ చెప్పారు.**

—అక్షరటుడే, సినిమా డెస్క్